క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మియాపూర్: సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి థియేటర్ రోడ్డు పనుల్లో భాగంగా విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సాయి ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ముగిసిన రాజకీయ విజ్ఞాన తరగతులు

మియపూర్ : మియాపూర్‌లోని ముజాఫర్ అహ్మద్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర రాజకీయ విజ్ఞాన తరగతులు ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ హాజరై సంఘ నిర్మాణం, ఆశయాలు,కర్తవ్యాలు అనే అంశంపై యువతీ,యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డివై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి, గోపి, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, అనిల్, గ్రేటర్ హైదరాబాద్ యువతుల విభాగం కన్వీనర్ సుల్తానా, కీర్తి, దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు పీఎస్‌కు స్థల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కొల్లూరుకు మంజూరైన నూతన పోలీస్‌స్టేషన్‌కు కావాల్సిన ఆధునిక భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు, ఉస్మాన్‌నగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా మంజూరైన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం స్థలం, తాత్కాలిక భవనాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఉస్మాన్‌నగర్‌లోని ఓ భవనంలో తాత్కలికంగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, తహసీల్దార్ జయరాం, ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, సోమిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు నర్సింహ, నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తరలిన బీఎస్‌పీ నాయకులు

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి నగరంలో ఆదివారం జరిగే బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ భరోసా సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షులు రాములు ఆధ్వర్యంలో కార్యకర్తలు ,నాయకులు తరలివెళ్లారు.

మృతదేహం కోసం గాలింపు

మాదాపూర్: దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె దూకిన చోట దాదాపు 45 నుండి 50 అడుగుల లోతు ఉండడంతో ఒక్కసారిగా మునిగిపోయిందన్నారు. 24గంటలు గడిచినప్పటికి మృతదేహం పైకి తేలకపోవడంతో మట్టిలో (ఊబి)లో కూరుకుపోయి ఉండవచ్చని పోలీసులు, లేక్ పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

పట్టపగలు చోరీ.. కత్తితో దాడి

- పారిపోతున్న దొంగను పట్టుకున్న స్థానికులు

మియాపూర్: పట్టపగలు ఇంట్లో చొరబడి దొంగతనం చేయడమేగాక అడ్డుకున్న ఇంటి యజమానిపై కత్తితో దాడి చేసి పారిపోతున్న దొంగను కుటుంబ సభ్యులు ,కాలనీ వాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వర్ రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శేరిలింగంపల్లి, నెహ్రూ నగర్ కాలనీకి చెందిన దాసరి సాయిలు కుటుంబ సభ్యులు ఆదివారం లింగంపల్లిలో పెళ్లికి వెళ్లారు. సాయంత్రం గుల్బర్గా జిల్లా చించోల్లికి చెందిన అక్బర్ పాష అనే వ్యక్తి వారి ఇంట్లోకి దూరి అల్మరాలో ఉన్న రూ. 1.17 లక్షల నగదు తీసుకుని పారిపోతుండగా ఇంటి యజమాని సాయిలు గమనించి అతడిని అడ్డుకున్నాడు. దీంతో అతను వెంట తెచ్చుకున్న కత్తితో సాయిలుపై దాడి చేశాడు. సాయిలు కేకలు విని అప్రమత్తమైన స్థానికులు దొంగను వెంబడించి పట్టుకుని చందానగర్ పోలీసులకు సమచారా అందించారు.. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గాయపడిన సాయిలును కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

మల్లన్న జాతర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ తండాలో ఆదివారం మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా చేరిన వరద నీరు (ఫైల్)

చినుకుపడితే..

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు

- వాహనాల రాకపోకలు నిలిపివేత
- వర్షాకాలం ఎలా..?
- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల డిమాండ్



శేరిలింగంపల్లి: చిన్నపాటి వర్షాలకే భారీగా వరద నీరు చేరడం.. వాహనాల రాకపోకలు నిలిచిపోవడం..దారి మళ్లించడం.. ట్రాఫిక్ సమస్య ఏటా ఇదేతంతు. లింగంపల్లి అండర్‌బ్రిడ్జి రోడ్డు లింగంపల్లి పరిసర ప్రాంతవాసులకు ప్రధాన రోడ్డు. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఔటర్ రింగురోడ్డు, నగరానికి వెళ్ళేందుకు వాడుకలో ఉంది. నిత్యం ఉద యం నుంచి అర్ధరాత్రి వరకు భారీగా వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రోడ్డు ముంపు సమస్యను శాశ్వత పరిష్కారం చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇక వర్షాకాలం ఆరంభమైతే ఎలా...? అనే ఆందోళన అందరిలోనూ కనిపిస్తోంది. సమస్య పరిష్కారానికి కొత్త బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల వర్షానికి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు వచ్చి చేరడంతో వాహనాలు నిలిచిపోవడం, దారి మళ్ళించడం.. ఏటా ఇదే పరిస్థితి.

ఎన్నో ఏళ్లుగా సమస్య

- ప్రతి ఏటా వర్షాకాలంలో భారీగా వరద నీరు లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. లింగంపల్లి నుంచి రైల్వేగేటు రోడ్డు, నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా దారి మళ్లిస్తారు.
- ఏటా సమస్య నెలకొన్నపుడు జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించడం తగిన చర్యలు తీసుకుంటామనడం ఏటా జరిగే తంతే.
- ముఖ్యంగా రైల్వే అండర్‌బ్రిడ్జికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైపు నుంచి, లింగంపల్లి రైల్వేస్టేషన్ వైపు నుంచి, లింగంపల్లి రోడ్డు నుంచి, హుడాకాలనీ కొత్త రోడ్డు నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది.
- అన్నివైపులా భూగర్భడ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ ఏర్పాటు చేసి వరద నీరు రోడ్డుపై పారకుండా వరదనీటి పైప్‌లైన్‌లోకి వెళ్ళేలా చేయాలి.

రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోనే పరిష్కారం



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అప్పటికప్పుడు చేపట్టే మరమ్మతులు ఉపశమనం. అండర్ బ్రిడ్జి కింద రోడ్డు ఎత్తు పెంచితే కార్లు, బైక్‌లు మాత్రమే వెళ్లే అవకాశం ఉంటుంది. రైల్వే ప్రయాణికులకు, పరిసర కాలనీల వాసులకు బస్సులు రాకపోతే ఇబ్బంది. అందువల్ల ఈ సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– రామస్వామి యాదవ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, శేరిలింగంపల్లి



శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీవాగ్దేవి నృత్యనికేతన్ గురువు కళ్యాణి తేజేస్వర్ రావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఆనందనర్తనం, సరస్వతి శబ్దం, ముద్దుగారే యశోద, వినాయకకౌతం, అదిగో అల్లదిగో, బ్రహ్మాంజలి, శివపంచాక్షరి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు గీతిక, కావ్య, పల్లవి, హిమజ, నిహారిక, భవ్య, ప్రణతి, శ్రీహర్షిణి పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ వీవీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కృష్ణ పాల్గొన్నారు.

- మాదాపూర్

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

పటాన్‌చెరు టౌన్: నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలపరిధిలోని ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తోపాటు రాష్ట్ర, జాతీయ నాయకులు హాజరవుతున్నారన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీలకతీతంగా నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్

ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో రియాక్టర్ వద్ద పనిచేస్తున్న ఇద్దరు కార్మికులకు గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో రియాక్టర్‌లో మెటీరియల్ వేస్తుండగా కార్మికులు మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు కోలీ, శివ మంగిలేష్ సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం కంచన్‌బాగ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం

బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్



కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, రవికుమార్‌యాదవ్

అల్విన్‌కాలనీ: ప్రజా సమస్యలపై పోరాడాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమం ఆదివారం ఆస్‌బెస్టాస్ కాలనీలో కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ అధికార నాయకుల బెదిరింపులకు బీజేపీ కార్యకర్తలు భయపడవద్దన్నారు. పాపిరెడ్డినగర్ కాలనీలో 58,59 జీవోల కింద ఇళ్ల రెగ్యులేషన్ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న నాయకులు ఇప్పుడు మొహం చాటేస్తున్నారని రాను రోజుల్లో కాలనీ వాసులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, పర్వతాలు యాదవ్, రాజిరెడ్డి, గోవర్ధన చారి, వెంకటేష్, శ్రీనివాస్‌పటేల్, శ్రీకాంత్ యాదవ్, శ్రీధర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో యువత చేరిక

మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, రవికుమార్‌ల ఆధ్వర్యంలో కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ నుంచి యువకులు వెంకటేష్, శ్రీనివాస్ పటేల్, లక్ష్మమ్మ, మణెమ్మలు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, రాజిరెడ్డి, గోవర్ధనాచారి, మురళీకృష్ణ, శ్రీధర్ పటేల్, సాయికుమార్, శ్రీకాంత్ యాదవ్, అరుణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో గోడపత్రికను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్ ముదిరాజ్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్‌రావు, పటాన్‌చెరు బీసీ నాయకుడు నీలం మధు హాజరవుతారన్నారు.

అందరికీ నెగిటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.

మాదాపూర్‌లో కార్డన్‌సెర్చ్



మస్తాన్‌నగర్‌లో తనిఖీ చేస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, పోలీసు అధికారులు

మాదాపూర్: మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మస్తాన్‌నగర్‌లో పోలీసులు శనివారం అర్ధరాత్రి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి ఆధ్వర్యంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, ఏసీపీ సీహెచ్ రఘునందన్‌రావు, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుపతితో పాటు 8 మంది ఎస్సైలు, పోలీసు సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేశారు. నలుగురు పాత నేరస్తులను గుర్తించారు. సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలను, రెండు బెల్టు షాపులు గుర్తించి 400 మద్యం బాటిల్స్, 15 బీర్ కాటన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ మస్తాన్‌నగర్‌లో అనుమానితులను, రెండు బెల్టు షాపులు, అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న షాపును, క్రాకర్స్ నిల్వఉంచిన షాపును గుర్తించినట్టు తెలిపారు.

సీడీఎఫ్ నిధులు కేటాయింపు

రాయదుర్గం: రాయదుర్గంలోని కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్థు నిర్మాణానికి మోక్షం లభించింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో నిధుల కేటాయింపు జరిగింది. రూ.12 లక్షల సీడీఎఫ్ ఫండ్స్ ద్వారా నిధులను కేటాయించేందుకు ఎమ్మెల్యే అంగీకరించారు. ఈ మేరకు సీడీఎఫ్ నిధుల కేటాయింపునకు అంగీకార పత్రాన్ని ఆయన ఆదివారం స్థానికులకు అందించారు. ఈ మేరకు నిధుల మంజూరు పత్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపే పత్రాలను స్థానికులకు ఆయన అందించారు. గచ్చిబౌలి డివిజన్‌లో సమగ్ర సంతులిత అభివృద్ధిలో భాగంగా సీడీఎఫ్ ఫండ్స్ కేటాయించేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, పాండు పాల్గొన్నారు.



నిధుల కేటాయింపు మంజూరు పత్రాన్ని స్థానికులకు అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి కంటే అవినీతే పెరిగింది

బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్



పార్టీలో చేరిన వారితో మారబోయిన రఘునాథ్‌యాదవ్

గచ్చిబౌలి: రాష్ట్రంలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం సాధించడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కొండాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు సాగర్ అధ్యక్షతన రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కమిటీ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి కంటే అవినీతే పెరిగిపోయిందన్నారు.ప్రజలు డబుల్ ఇళ్లు రాక నిరాశ్రయులు కాగా, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ, మోర్చా నాయకులు సునీత, శ్రీదేవి, ఆత్మారామ్, కిషన్‌జీ, మన్నెంకొండ సాగర్, సంతోష్‌గుప్తా, సురేష్‌సాగర్, రాములుగౌడ్, అజయ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఐటీ.. ఆధ్యాత్మికతకు నిలయం

రాయదుర్గం: ఆధ్యాత్మికతకూ నిలయంగా మారాయి ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిసరాలు. శతాబ్దాల చరిత్ర కలిగిన దేవాలయాలు పరిఢవిల్లుతున్నాయి. శేరిలింగంపల్లి పరిధి గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి, టెలికామ్‌నగర్, గోపన్‌పల్లి, గౌలిదొడ్డి వంటి ప్రాంతాలలోని ఆలయాలకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. 450 ఏళ్ళ నాటి రాయదుర్గం వెంకటేశ్వరస్వామి ఆలయం , నానక్‌రాంగూడ రంగనాథస్వామి, గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయం, నిజాంకాలంలో వెలిసిన మధురానగర్ ఎదురుగడ్డ మైసమ్మ ఆలయం ఉన్నాయి.అలాగే రాయదుర్గం హుస్సేన్‌షావలీ దర్గాకు కూడా 450 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లు గుర్తింపు పొందింది. కాగా రాయదుర్గం, నానక్‌రాంగూడ ఆలయాల్లో నిర్వహించే రథోత్సవానికి ప్రత్యేకత ఉంది. అలాగే పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో దేవాలయాలను నిర్మించారు.

ఏటా వైభవంగా ఉత్సవాలు

- నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయంలో ఏటా వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.
- రాయదుర్గంలోని హుస్సేన్‌షావలీ దర్గాలో మూడు రోజులపాటు జరిగే ఉర్సుకు పలు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు.



నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయ ప్రధాన గోపురం



రాయదుర్గంలోని హుస్సేన్ షావలీ దర్గా



మధురానగర్‌లో ఎదురుగడ్డ మైసమ్మ



గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం



వేంకటేశ్వరస్వామి ఆలయం